RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

# QUICK TODAY

ఆదివారం 1 డిసెంబర్ 2024

quicktodaynews.com





## మిత్రుడి కుటుంబానికి

# ఆర్థిక సహాయం అందజేత

శివ్వంపేట డిసెంబర్ 18 (క్విక్ టు డే న్యూస్): మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పెద్ద గొట్టిముక్కల గ్రామానికి చెందిన మస్క్కూరి రవి గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి మిత్రుడు మస్క్కూరి రవి కుటుంబ సభ్యులకు రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. శ్రీశైలం, నగేశ్, నర్సింగరావు, అయిలయ్య, కృష్ణ, మహేశ్, ఆంజనేయులు, శ్రీధర్, శ్రీనివాస్, మహేశ్ అందించారు.

## పద్మశాలి సంఘం రాష్ట్ర

# ఉపాధ్యక్షుడిగా గజేందుల నరసింహులు

శివ్వంపేట డిసెంబర్ 18 (క్విక్ టు డే న్యూస్): మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దంతాన్ పల్లి గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గజేందుల నర్సింహులును పద్మశాలి సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్ నియమించారు. మంగళవారం హరిహర కళాభవన్లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నియామక పత్రం అందజేశారు. నియామకం చేసినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి, జిల్లా అధ్యక్షుడు మేకల జయరాములుకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలు ఆర్థిక

# అభివృద్ధి సాధించాలి



శివ్వంపేట డిసెంబర్ 18 (క్విక్ టు డే న్యూస్): పేద మధ్య తరగతి మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నట్లు ఐటీసీ బంధన్ కునేఘర్ శివ్వంపేట బ్రాంచ్ మేనేజర్ ముజేందర్ పేర్కొన్నారు. శివ్వంపేట మండలం గూడూర్ గ్రామంలో మహిళా సమావేశం నిర్వహించారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం రూ.15 వేల వరకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. శివ్వంపేట బ్రాంచ్ పరిధిలో 200 మంది మహిళలకు చిన్న వ్యాపారాల కోసం ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.

# అదానీని వెంటనే అరెస్టు చేయాలి

## -కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్





కూకట్‌పల్లి, డిసెంబర్ 18 (క్విక్ టుడే న్యూస్): అదానీ అవినీతి వ్యవహారంపై ఏఐసీసీ చలో రాజభవన్ పిలుపు కార్యక్రమంలో కూకట్పల్లి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ%శీ% నుంచి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు నెక్లెస్ రోడ్ లోని స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వద్దకు వాహనాలపై పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ముందుగా మూసాపేటలోని ఇందిరా గాంధీ విగ్రహానికి బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన జెండా ఊపి బస్సు ర్యాలీని ప్రారంభించారు. నెక్లెస్ రోడ్ లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు జిందాబాద్ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి జిందాబాద్ కాంగ్రెస్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. మోడీ పాలన తీరును ఎండగడుతూ దేశ ప్రతిష్టను దిగజార్చిన అదానిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడినుండి రాజ్ భవన్ వరకు సీఎం రేవంత్ రెడ్డి వెంట బండి రమేష్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు, మహిళ నాయకురాలు, తదితరులు పాదయాత్రగా వెళ్లారు.

## అభివృద్ధిలో దూసుకుపోతున్న

# పీర్జాదిగూడ 2వ డివిజన్

**నూతన సిసి రోడ్లు,డ్రైనేజ్ నిర్మాణానికి శంకుస్థాపనలు**

**ముఖ్య అతిధులుగా పాల్గొన్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ శివకుమార్ గౌడ్**

**2వ,డివిజన్ ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడమే నా లక్ష్యం**

**యంగ్ డైనమిక్ లీడర్, కార్పొరేటర్:కేతావత్ సుభాష్ నాయక్**





**పీర్జాదిగూడ, డిసెంబర్ 18 (క్విక్ టుడే న్యూస్):** పీర్జాదిగూడ 2వ డివిజన్ పరిధిలో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు స్థానిక కార్పొరేటర్ సుభాష్ నాయక్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుభాష్ నాయక్ మాట్లాడుతూ రెండో డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని,మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ సౌజన్యంతో పాలకవర్గ సభ్యుల సహకారంతో 2వ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతున్నామని,అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 03లో సుమారు 24 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం, కమల నగర్-ఎం కె బి ఆర్ రోడ్డులో సుమారు 25 లక్షలు నిధులతో సిసి రోడ్లు డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణం, శ్రీ సాయి నగర్ కాలనీ ఈస్ట్ లో సుమారు 7 లక్షల నిధులతో డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణం, అదేవిధంగా సుమారు 40 లక్షల నిధులతో వరద నీటి డ్రైనేజీ క్యాప్చర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని,త్వరలోనే పనులను ప్రారంభిస్తామని సుభాష్ నాయక్ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు,వివిధ కాలనీలా అధ్యక్ష కార్యదర్శులకు, కాలనీ వాసులకు కార్పొరేటర్ సుభాష్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘు,డి ఈ సాయినాథ్ గౌడ్,కార్పొరేటర్లు భీమిరెడ్డి నవీన్ రెడ్డి, మద్ది యుగంధర్ రెడ్డి,ఏంపల్ల అనంతరెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు దర్గా దయాకర్ రెడ్డి,పప్పుల అంజిరెడ్డి,మాడుగుల చంద్రారెడ్డి,యాచారం మహేష్, కుర్ర శ్రీకాంత్,కోఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి,ఇర్ఫాన్,జలంధర్ రెడ్డి, మణిరామ్ నాయక్,శ్రీలత, శారదా,జయేందర్ ,సునీల్, ప్రశాంత్,ఎస్వీ కాలనీ అధ్యక్షులు రాధా కిషన్ రావు,వరికల శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, ఎరుకల రమేష్, పల్లె బాల్ రెడ్డి, కూరెళ్ళ ఉపేందర్,శంకరా చారి, మేకల రాజు, సౌత్ పంచవటి కాలనీ అధ్యక్షులు నరసింహా రావు,ప్రధాన కార్యదర్శి సుబ్బారావు,కాలనీ కార్యవర్గ సభ్యులు, ఈస్ట్ శ్రీ సాయి నగర్ కాలనీ అధ్యక్షులు ఉపేందర్,ప్రధాన కార్యదర్శి నవీన్ రెడ్డి, పలు కాలనీల కార్యవర్గ సభ్యులు, మహిళలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చలో రాజ్ భవన్ విజయవంతం

**భారీగా తరలివచ్చిన పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**పీఎంసీ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ర్యాలీ**





**పీర్జాదిగూడ, డిసెంబర్ 18 (క్విక్ టుడే న్యూస్):** అమెరికాలో గౌతమ్ అదానీపై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మణిపూర్ లో జరిగిన అల్లర్లు,



విధ్వంశాలపై మోడీ సర్కార్ స్పందించకపోవడంతో మోడీ వైఖరిని ఖండిస్తూ ఏఐసిసి పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఛలో రాజ్ భవన్' కార్యక్రమం విజయవంతమైంది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన నిరసన ర్యాలీ నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్ భవన్ వరకు సాగింది. ఈ నిరసన కు మద్దతుగా రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి అధ్యక్షతన పీర్జాదిగూడ నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో "చలో రాజ్ భవన్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, పీర్జాదిగూడ మహిళా అధ్యక్షురాలు శ్రీలత భద్రు నాయక్, ఉపాధ్యక్షులు మహ్మద్ మజర్, వెంకటేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిరాం గౌడ్, సీనియర్ నాయకులు, మహేష్, శ్యామ్, సాయి రెడ్డి, పఠాన్, మహేశ్వరప్ప కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు శారదా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కమలానగర్‌లో

# అయ్యప్ప స్వామి మహా పడి పూజ



పీర్జాదిగూడ, డిసెంబర్ 18 (క్విక్ టుడే న్యూస్): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొదటి డివిజన్ కమలానగర్ కాలనీ యందు హరిహర సేవ సమితి అంజి గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు సామల సాయిలు, రఘు వీర్ సింగ్, కాలనీ అధ్యక్షులు సామల నర్సింహా, శ్రీనివాస్ రెడ్డి, కందుకూరి ఆంజనేయులు, రవీందర్ రెడ్డి, శ్రీశైలం, రమేష్ బాబు, మురరి లాల్, మహిళలు, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో

# పరవాడ కార్మికుడి మృతి





విశాఖపట్నం బ్యూరో (క్రృకే టుడే న్యూస్): రాంబిల్లి మండలం, మన్యపు చింతువా నేవీ కాలనీ చుట్టూ ఎన్ ఏ ఓ బి నిర్మాణ పనులు చేస్తున్న డి ఆర్ డి ఓ, పరిధిలో సబ్ కాంట్రాక్టర్ అయినా దొరాజియా కంపెనీలో,పరవాడ మండలం,పరవాడ గ్రామానికి చెందిన ఫోర్ మెన్ గా పనిచేస్తున్న, బండారు నీలబాబు (39), విద్యుత్ షాక్ తో కన్స్ట్రక్షన్ ప్రాంతంలోనే బుధవారం మృతి చెందాడు. మృతదేహానికి నివాళులర్పించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడు నాయుడు మాట్లాడుతూ, ఎన్ ఏ ఓ బి నిర్మాణ పనుల్లో అనేకసార్లు ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయని, కార్మికులకు, ఉద్యోగులకు భద్రత లేకపోవడం వల్లనేఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కంపెనీ యాజమాన్యాలు వారి లాభాలే చూసుకుంటున్నారు తప్ప, కార్మికుల రక్షణ కోసం ఆలోచించడం లేదని మండిపడ్డారు. అనేకమార్లు ఈ సమస్యపై సెంట్రల్ లేబర్ అధికారులకు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదు అన్నారు. మృతుని కుటుంబానికి 50 లక్షలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన, డి ఆర్ డి ఓ, దొరాజియా కంపెనీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

ఆదివారం 1 డిసెంబర్ 2024

quicktodaynews.com



# జమ్ముకశ్మీర్‌లో అగ్ని ప్రమాదం..

### కథువాలో ఊపిరాడక ఆరుగురి మృతి

**శ్రీనగర్, డిసెంబర్ 18:** జమ్ముకశ్మీర్‌లోని కథువాలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శివనగర్‌లోని ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇల్లంతా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఊపిరాడక ఆరుగురు మరణించారు. మరో ముగ్గురు అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వారిని చికిత్స నిమిత్తం కథువాలోని జీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, అగ్ని ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసే ప్రయత్నం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఇంటికి మంటలు అంటుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.



### రాజస్తాన్‌లో

# మందుగుండు పేలుడు

### ఇద్దరు జవాన్లు మృతి

**జైపూర్, డిసెంబర్ 18:** రాజస్థాన్ బికనీర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మందగుండు పేలడంతో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ నార్త్ క్యాంప్ ఆర్టిలరీ ప్రాక్టీస్ సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నది. ఈ పేలుడులో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో సైనికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే సూరత్‌గఢ్‌లోని మిలటరీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సైనిక విన్యాసాల జరుగుతున్న ఫైరింగ్ రేంజ్‌లోని చార్లీ సెంటర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న సైనికాధికారులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. మహాజన్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ కశ్యప్ సింగ్ ప్రమాదాన్ని ధ్రువీకరించారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ లో ఆర్మీ ప్రాక్టీస్ కొనసాగుతోందని కశ్యప్ సింగ్ తెలిపారు. ట్యాంక్‌లోకి మందుగుండును ఎక్కిస్తున్న సమయంలో పేలుడు చోటు చేసుకున్నది. మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో వారం వ్యవధిలో సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇది రెండో ఘటన. ఈ నెల 15న ట్రైనింగ్ సమయంలో ఓ సైనికుడు వీరమణం పొందాడు. చంద్ర ప్రకాష్ పటేల్ టోయింగ్ వాహనానికి తుపాకీని అటాచ్ చేస్తున్నప్పుడు, తుపాకీ గన్ మౌంట్ ర్యాంప్‌పై ట్రాక్షన్ కోల్పోయి వెనుక్కు జారింది. దాంతో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఫీల్డ్ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు అప్పటికే చనిపోయినట్లుగా తెలిపారు.

# మార్చి నాటికి ట్రిపుల్ ఆర్ భూసేకరణ

### అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెల్లడి



హైదరాబాద్, డిసెంబర్18 (క్విక్ టుడే న్యూస్): వచ్చే మార్చి నాటికి రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని, నాలుగేండ్లలో ఆర్ఆర్ఆర్ పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో రోడ్లను విధ్వంసం చేశారని ఆయన మండిపడ్డారు. అసెంబ్లీలో కోమటిరెడ్డి మాట్లాడుతూ 'బీఆర్ఎస్ కు రోడ్లపై అవగాహన లేదు. ఉప్పల్ ఫ్లై ఓవర్ ను ఆరేండ్లు ఖాళీగా పెట్టారు. గత పాలకులకు ఎంతసేపు పైసలు వచ్చే కాళేశ్వరం తప్ప రోడ్లను పట్టించుకోలేదు. కమిషన్ తీసుకుని కూలిపోయే కాళేశ్వరం కట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ కోసం నాలుగు లైన్ల రోడ్లను ఆరు వందల కోట్లతో వేసుకున్నారు. లక్ష కోట్ల విలువ చేసే ఓఆర్ఆర్ అమ్ముకున్నారని ఆరోపించారు. హరీశ్‌రావుకు దబాయించడం తప్ప పని చేయడం తెల్వదు. నేను మాట్లాడుతుండగా ఎంత రిక్వెస్ట్ చేసినా కూర్చోవడం లేదు. ఆయనకు కూలిపోయే కాళేశ్వరం కట్టి కమిషన్ తీసుకోవడం మాత్రమే తెలుసు. రోడ్లు వేయడం చాతకాదు.. కూలిపోయే ప్రాజెక్టులు కట్టారని మంత్రి మండిపడ్డారు.

### విద్యారంగం అభివృద్ధికి

# చర్యలు తీసుకోవాలి

### అసెంబ్లీలో చర్చలో కూనంనేని తదితరుల డిమాండ్



హైదరాబాద్, డిసెంబర్18 (క్విక్ టుడే న్యూస్): ఏ ప్రభుత్వానికైనా విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉంటుందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యాలయాలను బాగు చేయాలని భారాస అధినేత కేసీఆర్‌కు మొదట్లో ఉండేదని.. ఆ తరువాత ఆయన అంచనాలు మారిపోయాయన్నారు. విద్యాలయాలు, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాల చర్చలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. 'విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలనే కసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కనిపిస్తోంది. స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు నిర్ణయాలతో ఆ విషయం స్పష్టం అవుతోంది. అయితే, ముఖ్యమంత్రి ఒక్కరికే ఆ తపన ఉంటే సరిపోదు. పైనుంచి కింది స్థాయి వరకు ఆచరించాలి. ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధ్యాయులు సంతోషంగా లేరు. పాఠశాల విద్యకు సంబంధించి 20వేల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్వ శిక్షా అభియాన్ వాళ్లకు కనీస వేతనం అమలు చేయడం లేదు' అని కూనంనేని పేర్కొన్నారు. 'ప్రజలు తమ ఏడాది సంపాదనలో విద్య, వైద్యానికే 90శాతం ఖర్చు చేస్తున్నారు. పేదవాళ్లు మరింత పేదవాళ్లవుతున్నారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలలను గత ప్రభుత్వం పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసింది. నాణ్యమైన విద్యను అందించకపోగా బర్రెలు, గొర్రెలు కాసేలా ప్రేరేపించారు. పేదవాడు విద్యకు దూరం కావాలని కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేసిందని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ అన్నారు. 'ఏడాది కాలంలో వెయ్యి మంది గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. 40 మంది విద్యార్థులు చనిపోయారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ పెరిగిపోతున్నాయనిభాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు.

# జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీరు

### 55 లీటర్లు ఒక మనిషికి ఇచ్చేలా

### కార్యాచరణ : డిప్యూటీ సీఎం పవన్‌కుమార్




అమరావతి, డిసెంబర్ 18 (క్విక్ టుడే న్యూస్): జల్ జీవన్ మిషన్ అమలుపై రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి పంపు, వాటి ద్వారా నాణ్యమైన మంచినీరు అందించాలనేది లక్ష్యమన్నారు. 2019 ఆగస్టులో ప్రారంభమైనప్పటికీ నీటిని అందించడానికే పరిమితం అయ్యిందని.. 2024 నాటికి మరింత బలోపేతం చేసి రోజూ నీటి సరఫరా చేయాలన్నారు. 55 లీటర్లు ఒక మనిషికి ఇచ్చేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మోడీ కలను మరింత సాకారం చేసేలా అడుగులు వేస్తున్నామన్నారు. నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులు గుర్తించి పరిష్కారం చూస్తున్నామని.. అమృతధార ద్వారా లోపాలు, ఇబ్బందులు సరిచేసి మంచినీటిని అందిస్తామన్నారు. నేడు నీరు ఎంత ఎక్కువ తాగితే అంత మంచిది అంటున్నారని.. నీరు దొరకని సమయాల్లో మనకు ఆ విలువ ఏమిటో తెలుస్తుందన్నారు. పొలిటికల్‌గా ఆకాశం అంత పందిరి వేస్తాం అన్నట్లుగా హామీలు ఇస్తామని.. కానీ ఆచరణలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొవాల్సి ఉందన్నారు. భీష్మ ఏకాదశిన 24 గంటలు మంచి నీళ్లు తాగకుండా ఉంటే ఆ ఇబ్బంది తెలుస్తుందన్నారు. "నేను ఈ శాఖ మంత్రిగా రివ్యూ చేస్తే... అనేక లోపాలు తెలిశాయి. ఈ పథకం అమలుకు ఒక్కో రాష్ట్రం ఒక్కో విధంగా లక్ష కోట్ల నుంచి 30 వేల కోట్ల వరకు అడిగారు. కేరళ 46 వేల కోట్లు అడిగితే.. మన ఏపీ మాత్రం 26 కోట్లే అడిగింది. మన రాష్ట్ర వాటా కూడా గత ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల జల జీవన్ మిషన్ అమలు కాలేదు. నేను కేంద్ర పెద్దలతో మాట్లాడితే వారు కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం గురించి చెప్పారు. నాలుగు వేల కోట్లను సద్వినియోగం చేయలేక పోయింది. కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పని చేశారు. నీరు ఎలా తెస్తారో చూడకుండా పైపులు మాత్రం వేశారు. రిజర్వాయర్‌ల ద్వారా నీటిని తీసుకోవాల్సి ఉండగా.. వాటిపై దృష్టి పెట్టలేదు" అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు నాయకత్వంలో ఈ నీటి సరఫరాపై దృష్టి పెట్టామన్నారు. సీఆర్ పాటిల్ దగ్గర కూడా మన రాష్ట్రానికి రూ.76 కోట్లు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆ ప్రాజెక్టు వివరాలు మొత్తం నివేదిక సిద్ధం చేసి జలశక్తి మంత్రికి అందజేయనున్నట్లు చెప్పారు. "పని చేయాలనే తపన ఉన్న అధికారులు మన రాష్ట్రంలో ఉన్నారు. నేను ఎక్కడకి వెళ్లినా పైపులు వేశారు.. నీళ్లు రావడం లేదని ఫిర్యాదులు చేశారు. గత ప్రభుత్వం 70.40 లక్షల గృహాలకు ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై పల్స్ సర్వే చేస్తే 55.30 లక్షల మందికి మాత్రమే నీటి కుళాయిలు పెట్టినట్లు తేలిందన్నారు. ప్రతి జిల్లాలో నీటి సరఫరాకు ఉన్న ఇబ్బందులు, వనరులు తెలుసుకునేందుకు ఈ వర్కు షాపు ఏర్పాటు చేశాం. మోడీ కలలను సాకారం చేసేలా ప్రతి ఇంటికి మంచి నీరు అందించాలి. ప్రతి వ్యక్తికి 55 లీటర్లు ఇచ్చేలా జల జీవన్ మిషన్ ద్వారా పనులు చేయండి. మానవతా దృక్పధంతో అందరూ కలిసి పనిచేయాలి. పైపు లైన్లు డిజైన్‌లు కూడా గందరగోళంగా ఉన్నాయి. గొయ్యి తవ్వి పైప్ లైన్ వేయడం తప్ప.. నీటి సరఫరాపై గత పాలకులు దృష్టి పెట్టలేదు. వీటికి శాశ్వతమైన పరిష్కారం చూడాలి... తాగునీటిని అందించాలి" అని అన్నారు.

# మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి

### 45వేల కోట్ల పనులకు కేబినేట్‌లో ఆమోదం

### త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం

### జులైలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలు

### రాజమహేంద్రవరం పర్యటనలో మంత్రి నారాయణ




**రాజమండ్రి, డిసెంబర్18 (క్విక్ టుడే న్యూస్):** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం రానున్న మూడేళ్లలో పూర్తి చేస్తామని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఏపీ రాజధాని అమరావతి పునఃనిర్మాణంపై వేగంగా అడుగులు వేస్తోంది.. ఇప్పటికే అనుమతి లభించిన 45 వేల కోట్ల రూపాయల నిర్మాణాలకి కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపి.. టెండర్లు పిలవబోతున్నామని తెలిపారు. అమరావతి మొత్తం ప్రాజెక్టు వ్యయం 62 వేల కోట్ల రూపాయలు అని వెల్లడించారు. రాజమండ్రిలో పర్యటనలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి.. వచ్చే ఏడాది జులైలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. గత ఆరు నెలలుగా రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పరిపాలన గాడిలో పెట్టామని అన్నారు. రాజధాని అమరావతిలో రానున్న మూడేళ్లలో ఐదు ఐకానిక్ టవర్లు.. 250 మీటర్ల ఎత్తులో అసెంబ్లీ భవనం.. హైకోర్టు సహా.. అధికారుల నివాసాలు.. ట్రంక్ రోడ్లు పూర్తి చేస్తామని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఇక, నగర పాలక సంస్థ, ఇండియన్ ఆయిల్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసి నిర్వహించనున్న ఫిల్లింగ్ స్టేషన్ ఇతర కార్పొరేషన్లకు స్ఫూర్తిదాయకమని అన్నారు మంత్రి నారాయణ.. రాజమహేంద్రవరంలో నూతనంగా ప్రారంభించుకున్న పెట్రోల్ బంకును స్ఫూర్తిదాయంగా తీసుకొని.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీ పరిధిలో పెట్రోల్ బంకులు ఏర్పాటు కార్యాచరణ ప్రణాళికలు ఏర్పాటు చేయటం జరుగుతుంది. గత ప్రభుత్వం టాక్స్ లను ఎన్నోసార్లు పెంచారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించి వినియోగిస్తున్న వాహనాల ఆయిల్స్ ప్రతి నెలా రూ.25.54 లక్షలు ఖర్చు చేస్తున్నాం. ఆర్ఎమ్సి ద్వారా ఐఒసిఎల్ సౌజన్యంతో పెట్రోల్ బంకు ఏర్పాటు వలన ఖర్చు ఆదా అవుతుంది. ఈ పెట్రోల్ బంకు నిర్మాణానికి నగరపాలక సంస్థ అందుకు అవసరమయ్యే స్థలాన్ని అందించింది. ఈ బంక్ ఏర్పాటు ద్వారా రోజుకు రు.3 లక్ష రూపాయలు టర్నోవర్ జరుగుతుందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ వెల్లడించారు.

# పడిపోతున్న ఉష్ణోగ్రతలు

### కనిష్ఠ స్థాయికి పడిపోతున్న పరిస్థితి

### మరో రెండు రోజులపాటు అధికంగా చలి తీవ్రత



**హైదరాబాద్, డిసెంబర్ 18 (క్విక్ టుడే న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలవుతుంది. ఇక ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే గజగజ వణికిపోతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న చల్లటి గాలుల వల్ల రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతున్నాయి. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల పాటు చలి తీవ్రత ఇదే మాదిరి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోతాయని, ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చాలా చోట్ల 7 డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పటాన్‌చెరులో 7 డిగ్రీలు, మెదక్‌లో 7.5 చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, ఉదయం వేళల్లో పొగమంచు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఉపరితల ఈశాన్య దిశలో చలిగాలులు గంటకు 2 నుంచి 6 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ లో కనిష్ఠ ఉష్ణోగ్రత 11.9 డిగ్రీల సెల్సియస్ నమోదు అయినట్లు వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 65 శాతంగా పేర్కొన్నారు. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని, ఉదయం, సాయంత్రం వేళల్లో అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు.

### మూసీ ప్రాజెక్టుపై

# కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు

### పదేళ్ల పాలనలో ఏనాడూ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలే

### బ్యాంకుల ముందు మోకరిల్లుతున్న సీఎం రేవంత్ : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, డిసెంబర్ 18 (క్విక్ టుడే న్యూస్): మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. పదేండ్లలో బీఆర్ఎస్ హయాంలో రుణం కోసం ఏనాడూ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని పేర్కొన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రపంచ బ్యాంకు ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. ఈ మేరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కల్వకుంట్ల కవిత కీలక విషయాలను బయటపెట్టారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు ప్రపంచ బ్యాంకుకు సెప్టెంబర్ 19వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించిందని అన్నారు. ఆ ప్రతిపాదనల్లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అని స్పష్టంగా రాసి ఉందని తెలిపారు. కానీ మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు.. మురుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో రుణం కోసం ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను, హైదరాబాద్‌ను ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ బ్యాంకు ముందు రేవంత్ రెడ్డి మోకరిల్లుతున్నారని ధ్వజమెత్తారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని స్పష్టం చేశారు. "ప్రపంచ బ్యాంకుకు కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 19న ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనల్లో స్పష్టంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు అని స్పష్టం రాసుంది. కానీ మంత్రి శ్రీధర్ బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు మరుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని తప్పుడు విషయం చెప్పారు. రియల్ ఎస్టేట్, ల్యాండ్ పూలింగ్ చేసి పెద్ద పెద్ద భవంతులు కడుతామని ప్రతిపాదనల్లో స్పష్టంగా పేర్కొంది.